# పిల్లి చచ్చిపోయింది

—ఎం. పినాకి

"సర్టెన్లీ, మిస్టర్ భార్గవ, సర్టెన్లీ. ఐ'ల్ లుక్ ఇంటుది మాటర్. సారీ సారీ ఫర్ ది డిలే....

డైరెక్టరుగారు విసుగ్గా ఫోను పెట్టేశారు. నుదుట తుడిచి, కోపంగా రిసీవర్ ఎత్తి 'గివ్ మి ఎ. ఒ.' అంటూ టి. ఒ. ను కసిరారు.

"యస్. ఇట్స్ మి. ఏమి ఓవర్ హియర్."

రెండు నిమిషాల్లో స్వింగ్‌డోర్స్ తెరుచుకొని ఎ. ఒ.గారు తోసుకొచ్చారు.

డైరెక్టరుగారు సీరియస్‌గా,

"వాట్టీజ్ దిస్ మిస్టర్ రాంచంద్రన్? మీ గొడవల్లో నన్ను గూడా ఇన్వాల్వ్ చేస్తున్నారు. ఆ పెన్షన్ కేసేమయింది. ఫైల్ ఇలా తీసుకురండి."

"సర్, మనం కొన్ని పర్టికులర్స్ కాల్ ఫర్ చేశామండి. అవి రాగానే..."

"నో....నోనో ఐ వాంటు సీ ది ఫైల్, గెటిట్" అని కళ్ళద్దాలు తుడుచుకోనారంభించారు డైరెక్టర్.

ఎ. ఒ. గారు తన మూడుమణుగుల పొన్న శరీరాన్ని మళ్ళీ మెట్లు దించి ఒగరుస్తూ సెక్షనులోకి ప్రవేశించి సూపర్నెంటు టేబుల్ మీది ఫైళ్ళ కట్టలు సగం పడేసి

"వెంకటస్వామి పెన్షన్ ఫైల్ ఎక్కడుంది? తొందరగా తీసుకురండి" అంటూ వెళ్ళిపోయాడు.

"అది అడ్మినిస్ట్రేషన్ సెక్షన్‌లో వుందండి. వాళ్ళు యాక్షన్ తీసుకున్నారు" అన్నాడు రంగనాథం వెనకే పరుగెత్తి.

"ముందు తీసుకురావయ్యా, డైరెక్టరుగారు అడుగుతున్నారు. తీసుకురా."

ఎ. ఒ. గారు మళ్ళీ తన శరీరాన్ని పైకి చేరవేసి విషయాలు విశదం చేస్తూండగా రంగనాథం ప్రవేశించి వంగి వంగి 'గుడ్‌మార్నింగ్' చెప్పి, ఎ. ఒ. గారికి ఫైలందించి దూరంగా చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"సో... దిసీస్ది ఫైల్... ఊఁ..."

"యస్సార్, లాస్ట్ వీక్ మనం పార్టీకి నాలుగో రిమైండర్ పంపించాం." అన్నాడు ఎ. ఒ. గారు.

డైరెక్టరుగారు కళ్ళద్దాలు సవరించుకుంటూ,

"ఐతే మీరు ఎ. ఎస్. నుంచి రెండో డి. ఒ. వచ్చిందాకా మాటర్ టేకప్ చెయ్యలేదన్నమాట. దిసీస్ వెరీ బాడ్, మిస్టర్ రాంచంద్రన్.

డైరెక్టరుగారు ఎ. ఒ. గారికి ఫైలిచ్చేశారు. ఎ ఒ. గారు దాన్ని రంగనాథానికి సరఫరా చేశాడు. రంగనాథం కిందికి పరుగెత్తి దాన్ని తన టేబుల్ మీదికి గిరాటేశాడు.

ఎ. ఒ. గారు తన గదిలోకి వచ్చిందే తడవుగా బెల్ నొక్కాడు. ప్యూన్ ఎదురుగా చేతులు కట్టుకు నిలబడ్డాడు.

"రంగనాథాన్ని పిలువ్" అని ఆజ్ఞ జారీ అయింది.

రంగనాథం హాజర్.

"ఫై లేదయ్యా, చేతులూపుకుంటూ వచ్చావేం, డిన్నరుకు పిలిశాననుకున్నావా?"

రంగనాథం రాగానే, ఫైల్ అతని చేతిలోంచి లాక్కుంటూ,

"చెణ్ణాళ్ళయ్యింది. ఇంకా కేసు ఓ గాడిలో పడలేదు. డైరెక్టరేమంటున్నాడో విన్నావా, నా అడ్మినిస్ట్రేషన్ బాగో లేదట. విన్నావా, ఇన్నేళ్ళ నా సర్వీసులో నీ మూలంగా డైరెక్టరుతో అంత మాట విన్నాను మిస్టర్ రంగనాథం......"

"ప్రతి ఫోర్ట్‌నైట్‌కు మనం ఇంటరిం రిప్లయ్ పంపిస్తూనే వున్నాం సార్."

"మళ్ళీ అదే మాట. ఇంటరిం రిప్లయి పంపితే కేసు సెటిల్ అవుతుందా, ఐనా ఈ మధ్య మనకు అశ్రద్ధ కూడా పెరిగింది. పోనీ అది నా మొహానెయ్యండి. నేను పర్సనల్‌గా డీల్ చేస్తాను."

"లేదండి, క్షమించండి... ఎంత మాట. ఇంకే కేసు పెండింగు వుండకుండా చూస్తాను."

"ఎప్పుడు చూసేది? వెన్ ఆర్ యూ గోయింగ్ టు డూ దట్?"

"ఇప్పుడేనండి, ఇప్పుడ్డ సార్. ఈక్షణం నించీ...."

కోపంతో, అవమానంతో వణికిపోతూ, సెక్షన్‌లోకి వచ్చి కూలబడ్డి,

"నాగేందర్, లెటర్ డ్రాఫ్ట్ చేశారా?" అన్నాడు రంగనాథం.

"పొద్దున్నే అది పూర్తయింది రంగనాథంగారూ" అంటూ వచ్చాడు నాగేంద్రం—పొట్టిగా, లావుగా, కొంచెం మాసిన గడ్డం, లావుపాటి కళ్ళద్దాలు, బాగానలు పెక్కిన పెదాలు, నవ్వగానే అతని నల్లటి మొహంలో మెరిసే ఓ బంగారు పన్ను.

"ఏది ఇదేనా లెటర్?"

నాగేంద్రం ఔనన్నట్లుగా పళ్ళికిలించాడు.

"నవ్వుతావేం నీ సర్వీసెంత?"

రంగనాథం తలెత్తకుండా అడిగాడు.

నాగేంద్రం తలొంచుకొని మాట్లాడకుండా నిలబడ్డాడు.

"నీ క్వాలిఫికేషనేమిటి?"

కొత్తలోనైతే జవాబిచ్చేవాడేమోకాని, పదేళ్ళ వుద్యోగం తర్వాత నాగేంద్రంలో ఆ ధైర్యం చచ్చిపోయింది.

"ఆహా ఎంత చక్కని ఇంగ్లీషు! నిన్నెవరయ్యా వుద్యోగంలో చేర్చుకున్నది? వొక్క లెటర్ డ్రాఫ్ట్ చెయ్యరాదు. ఇది నువ్వు డైరెక్టరుగారికి పుటప్ చేశావా? నీ జూనియర్స్‌కు చూపించి కరెక్ట్ చెయ్యమను."

నాగేంద్రానికి మెడ నెప్పి పుట్టింది.

"మిస్టర్, ఇట్ షోస్ యువర్ ఇనెఫిషియన్సీ. ఇట్ షోస్ యువర్ కేర్‌లెస్‌నెస్, ఇలాంటి జనంతో నేనెలా వర్క్ డిస్పోస్ చెయ్యను? ఏదీ గత వారం నువ్వెంత పని చేశావో చూపించు."

గబగబా ఫైళ్ళు కదిలించబడినై.

"ఇవన్నీ" అన్నాడు నాగేంద్రం ఫైళ్ళు రంగనాథం ముందు పెడుతూ.

"ఇవన్నీ! ఎన్ని? ఆరు. వారానికి ఆరు. అందులో నాలుగు నేనే డీల్ చేశాను. పేపర్స్ ఎలా ఫైల్ చెయ్యాలో కూడా తెలియదా? ఆఫీసరుకు చూపించు సంతోషిస్తాడు. షార్ట్ లీవ్ తీసుకున్నావు. లేట్ పర్మిషన్ తీసుకున్నావు. కాని పని చెయ్యాలే అని ఎప్పుడన్నా ఓ అరగంట ముందొచ్చావా, ఓ గంట ఎక్కువ కూ

ర్చున్నావా? ఓ సండే అటెండ్ అయ్యావా? నీ అశ్రద్ధకు నేను తిట్లు తినాలి. మధ్యాహ్నం నీకో మెమో వస్తుంది. వెళ్ళు."

"ఒద్దు సార్. ఇక మీద...."

"వెళ్ళు వెళ్ళు నేనేం విన దలచుకో లేదు?"

నాగేంద్రం సీట్లో వక్కేడు.

రాత్రి తొమ్మిదింటికి ఆకలి, తిట్లు, అలసట అతన్ని విసిగించగా సైకిల్ తీసుకొని బయల్దేరాడు నాగేంద్రం. సైకిల్ లాంపులో నూనె పోయించుకుని, డబ్బుకోసం వాడితో తగవాడి, మళ్ళీ చీవాట్లు తిని నాలుగడుగులు తొక్కాడో లేదో, సైకిల్ పంచరైంది. చివరి ఓపికను కూడగట్టుకుని మూడు మైళ్ళు యింటిదాకా నడిచాడు.

సైకిల్‌కు తాళం వేసి ఇంట్లో అడుగు పెట్టగానే పెళ్ళాం ఎదురై,

"మీరొక్కరే సినిమా చూసి వస్తున్నారా? మమ్మల్ని కూడా తీసికెడతామన్నారుగా, అవును లెండి అక్కడ మేం జ్ఞాపకముంటామా? ఇంట్లో చాకిరి చెయ్యటానికిగాని...." అంటో పలకరించింది.

మాట్లాడకుండా నాగేంద్రం కాళ్ళూచేతులు కడుక్కొని వచ్చి భోజనానికి కూర్చున్నాడు.

పెళ్ళాం విసుగ్గా చప్పుడు చేస్తూ వడ్డించింది.

"ఇలా వడ్డించటానికి మాత్రం నేను కావాలి."

"నోర్మూసుకో కాసేపు." అన్నాడు నాగేంద్రం పరుషంగా.

"మూసుకునే పడుంటున్నాను లెండి. నా ఖర్మ యిలావుంది. ఒంట్లో బావున్నా లేక పోయినా...."

"అన్నం జావలా యిలా వుందేం?"

పెళ్ళాం మాట్లాడ లేదు.

"కూర ఏమీ లేదా?"

"పచ్చడి వుందిగా"

"కూర!"

"అలా గొంతు చించుకుంటారేం. కూర! మీరు తెందే ఎక్కణ్ణించొస్తుంది? అలా అలా షికార్లు కొట్టి..."

"సరే, యింత ప్లా నా మొహాన పొయ్యి!"
"పిల్లి పొద్దున్నే పాలు తాగి పోయింది...."
కంచం పెళ్ళాం మొహాన కొట్టాడు. గ్లాసు పారేశాడు.

"లం.... అశ్రద్ధేముండా. ఆఫీసులో చచ్చిచెడ్డి నేనొస్తే, నువ్వేమో ముపొద్దులా దిగమెక్కి, కొవ్వెక్కి ఎదురు జవాబిస్తావా. ఒంట్లో భయముంటే అన్నం ఎలా పాడవుతుంది, పిల్లి ఎలా వస్తుంది..." అంటూ బూతులు కూస్తూ పెళ్ళాన్ని బాది విరిగిన కట్టును పారేసి అసహనంగా అవతలికి నడిచాడు నాగేంద్రం.

ఈ గొడవకు నాలుగేళ్ళ వాళ్ళ పిల్లాడు లేచి ఏడుపు మొదలెట్టాడు
తల్లి పిల్లాన్నెత్తుకోలేదు. ఓదార్చలేదు. తనూ ఏడుస్తూ ఓ మూల కూర్చుంది.
పిల్లాడు శృతి పెంచాడు.
"కమలమ్మా, తల్లీ..." అంటూ వచ్చింది పక్కవాటా కనకమ్మగారు.
కళ్ళు తుడుచుకుంటూ ఎదురెళ్ళింది యిల్లాలు.

"కమలమ్మా, మా కోడలూ, అబ్బాయి యిప్పుడే గదిలోకెళ్ళారు. వాళ్ళకు నిద్ర పట్టదు. కొంచెం పిల్లాన్ని సముదాయించమ్మా... తల్లీ." అని వెళ్ళింది.

కమలమ్మ కొడుకువైపు నడిచి 'ఊరుకోరా' అంది.
తల్లి కనిపించగానే పిల్లవాడు గొంతు పెద్దది చేశాడు.

'వెధవ ముండాకొడకా, నా గండాన పుట్టావురా, తండ్రీ, కొడుకూ నా ఉసురుకు యములాళ్ళలా దాపురించారు. ఊరుకో. నాలుగేళ్లొచ్చినా ఇంకా రొమ్ము కావాలా. ఏముంది, నా నెత్తారు తాగుతావా? నే చస్తే పీడాపోతుంది. చావు. అందరూ నా మీదే పడి యాడవండి. ఛుయ్. నోర్మూస్తావా లేదా?........'

కొత్తగా వేయించుకున్న రెండు చేతుల గాజులూ పగిలి పోవటంతో తల్లి మళ్ళీ గొల్లుమంది, తల గోడకేసి బాదుకుంది.

* * *

కిటికీలో పిల్లి మ్యాంవుమంది.
అలసి మగతగా కళ్ళుమూసిన పిల్లాడు మేల్కొన్నాడు.
పిల్లి మళ్ళీ మ్యాంవుమంది.
చేతికందిన విరిగిన కట్టను తీసుకుని కసితీరా పిల్లివైపు గిరాటేశాడు పిల్లాడు.